క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే



పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన పద్మకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని శనివారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రాముయాదవ్, సాయికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై అవగాహన

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమంపై శనివారం వైద్య సిబ్బంది పర్యటించి కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ 18ఏళ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, ఏఎన్‌ఎం నర్సమ్మ, కార్యదర్శి స్వాతి, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాన్‌గల్: అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రక్తహీనతపై అవగాహన కల్పించి రక్తపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, బలమైన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. బాలికలకు అందించే పౌష్టికాహారం పకడ్బందీగా అందించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అసియాబేగం, షహీన్‌బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

వీపనగండ్ల: పోషణ్ అభియాన్ పక్షోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కిశోర బాలికలు, గర్భిణులు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో బరువు తక్కువ, రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయించినట్లు ఉమ్మడి మండలాల సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మీదేవి తెలిపారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని స్థానిక బీపీఆర్ గార్డెన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ వంశీధర్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని, నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, కుటుంబ సభ్యులు, మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పుర్గర్‌చర్లలో..

వీపనగండ్ల: మండలంలోని పుర్గర్‌చర్లలో ఆదివారం మధ్యాహ్నం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అరుణమ్మ తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

వీపనగండ్ల: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కిట్లను ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, చిన్నంబావి ఎంపీడీఓ రవినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ సోమేశ్వరమ్మ, గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి పది జీపీఏ సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు, గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈదన్న, సింగిల్ విండో చైర్మన్ నర్సింహారెడ్డి, మధు, సురేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఖిల్లాఘనపురం: రైతులు పంటల సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఉదయ్, శ్రీధర్, పరిమళ కుమార్, ఏడీఏ సత్యంబాబు తెలిపారు. శనివారం మండలంలోని పర్వతాపురంలో రైతువేదికలో రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మల్లయ్య, వెంకటేశ్వర్‌రావు, ఏఈఓలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గోపాల్‌పేట: ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని హనుమాండ్లగడ్డకు చెందిన శివకృష్ణ ఈనెల 20న రాత్రి తన ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని నిలిపి, తాళాన్ని ట్యాంక్ కవర్‌లో పెట్టాడు. ఉదయం చూసే సరికి బైక్ కనిపించలేదని, దీంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

మహిళా సంఘాలకు 'లఖ్‌పతి దీదీ'

- సంఘాల వివరాలు యాప్‌లోనే నమోదు
- సమాచారం ఆధారంగా ప్రగతి కార్యాచరణ



పెబ్బేరులో సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు

పెబ్బేరు: మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తూ సంఘాలను ఏర్పాటు చేసి ఈ సంఘాల బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు, పలు రాయితీ పథకాలను అమలుచేయడంతో పాటు తాజాగా కేంద్రం పొదుపు సంఘాల సభ్యుల ప్రగతిపై 'లఖ్‌పతి దీదీ' యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో వారి ప్రగతి ఎలా ఉంది? లక్ష్యాలు ఏ మేరకు చేరారనే విషయాలను నమోదు చేస్తున్నారు. ఫలితాల ఆధారంగా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సమాచారం నిక్షిప్తం..

వనపర్తి జిల్లాలో 343 గ్రామ సమాఖ్యలు, 7,331 పొదుపు సంఘాలున్నాయి. వాటిలో సుమారుగా లక్షకుపైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. పొదుపు సంఘంలో చేరకముందు వారి పరిస్థితి? చేరాక ఆర్థిక పరిస్థితుల్లో ఏమైనా మార్పులు ఉన్నాయా? అని క్షేత్రస్థాయి సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఎన్నిసార్లు బ్యాంక్ లింకేజీ తీసుకున్నారు? రుణ వాయిదాల చెల్లింపులు ఎలా ఉన్నాయి? వంటి విషయాలను ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పితే ఎంత పెట్టుబడితో ప్రారంభించారు? ఆదాయం ఎలా ఉందనే విషయాలను క్రోడీకరిస్తున్నారు.

భవిష్యత్‌లో ఎంతో ఉపయోగం..

జాతీయ జీవనోపాధుల మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ఆధ్వర్యంలో యాప్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందులో నమోదు చేసిన వివరాల ఆధారంగా మహిళా సంఘాల ప్రస్తుత పరిస్థితిని కేంద్రం అంచనా వేయనుంది. ఆయా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలంటే భవిష్యత్‌లో ఎలాంటి కార్యక్రమాలు, పథకాలు అమలు చేయాలని ఈ యాప్‌లోని సమాచారమే ఉపయోగపడనుంది.

యాప్‌లోనే సమాచారమంతా..



'లఖ్‌పతి దీదీ యాప్' లో మహిళా సంఘాల సభ్యుల సమగ్ర సమాచారంతో పాటు, ప్రగతి వివరాలు కూడా నమోదు చేస్తాం. ఇప్పటికే వనపర్తి జిల్లాలోని వీబీకేలకు వివరాల నమోదుపై అవగాహన కల్పించాం. వారు క్షేత్రస్థాయికి వెళ్లి సంఘాల సభ్యుల వివరాలు నమోదు చేస్తారు. దీనివల్ల సంఘాల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. – నర్సింహులు, డీఆర్‌డీఓ

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



తండాలో నీటి సమస్యపై ఆరా తీస్తున్న ఏఈ లక్ష్మీకుమార్

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలోని 9, 10వ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ తెలిపారు. తండా సర్పంచ్ శాంతమ్మ ఇటీవల తాగునీటి సమస్యపై ఏఎస్‌ఈకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు శనివారం సందర్శించారు. వార్డుల్లో నిర్మించిన మిషన్ భగీరథ నీటి ట్యాంకుకు సక్రమంగా నీటి సరఫరా రాక ప్రతి వేసవిలో సమస్య ఉత్పన్నమవుతున్నట్లు ప్రజలు ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను జిల్లా అధికారులకు వివరించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పే స్కేల్ అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

కొత్తకోట: ఉపాధి హామీ ఉద్యోగులు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ బాలయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పథకంలో 3,874 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారందరికి పే స్కేల్ వర్తించేలా చేస్తానని సీఎం కేసీఆర్ గతంలో హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇటీవల కాలంలో సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తించే విధంగా జీఓ తీసుకురావడం హర్షించదగ్గ విషయమని, అదే విధంగా ఉపాధి హామీ ఉద్యోగులకు కూడా పే స్కేల్ జీవో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నాగేష్, రాములు, భాస్కర్, అరుణ, జ్యోతి, ఇందిర, మంజుల, మౌనిక, పుష్పలత, బాలరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిని కాపాడాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని 4వ వార్డులో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి రహదారిపై మట్టిని ఉంచాడని కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ సమస్యను పరిష్కరించే వరకు కదలమంటూ రెండో రోజు నిరసన చేపట్టారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని తన ఇంటి స్థలం అంటూ కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారికి సీసీ వేయించాలని కోరారు. పలు సందర్భాలలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రహదారిపై వేసిన మట్టిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలనీవాసులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహ్మద్ ఖాజా మాట్లాడారు. నకిలీపత్రాలు సృష్టించి తప్పుడు విధానాలతో ఇంటి స్థలం అంటూ రహదారిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విషయాన్ని సబ్‌రిజిస్ట్రార్‌కు విన్నవించామని ఈనెల 28 నాటికి కాలనీ ప్రజల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింధు, రాజ్ కుమార్ అబ్రహం, శ్యాంసుందర్, భాస్కర్, స్వాతి, పద్మమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వల కొరత ఉందని తెలుసుకుని శనివారం నలుగురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆపద సమయంలో రక్త కొరత వల్ల చనిపోయే ప్రమాదం ఉందని, అర్హత గల ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరవింద్, సంతోష్, సురేష్, రవి, ఉపేందర్, శివశంకర్ తదితరులు ఉన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన మంత్రి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని తాళ్ల చెరువుకట్టపై ఏర్పాటు చేసిన వేదికపై కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 732 మందికి రూ.7.32 కోట్ల విలువైన చెక్కులను మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. మరో 543 మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. 239 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు మంత్రి సొంత ఖర్చుతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

తాళ్ల చెరువుకట్టపై ఇఫ్తార్

రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు మంత్రి శుక్రవారం తాళ్లచెరువుకట్టపై ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కట్టపై ముస్లింలతో కలిసి మంత్రి విందును స్వీకరించారు. కలిసిమెలిసి ఐకమత్యంతో ప్రగతి సాధించాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిశు మందిరాలు సంస్కృతికి నిలయాలు

అమరచింత: సరస్వతీ శిశుమందిరాలు సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం శ్రీసరస్వతి శిశుమందిరంలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తమ డీఎంఆర్‌ఎం సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య వ్యాపారమైందని, అలాంటి వాటికి భిన్నంగా క్రమ శిక్షణే లక్ష్యంగా సరస్వతీ విద్యా మందిరాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, సౌజన్యారెడ్డి, బాలస్వామి, విజయ్, నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదు



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆత్మకూర్ మండల కేంద్రంలో శనివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియంత పరిపాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. రాహుల్‌గాంధీని పార్లమెంట్ నుంచి బహిష్కరించడం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమన్నారు. ప్రధాని మోదీ పరిపాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి దారులకు అందలం వేస్తున్నారని నిలదీయడంతోనే ఇలాంటి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రఘు, ఖాజా, బషీర్, బాలరాజ్, శ్రీనివాసులు, ప్రహ్లాద్, చెన్నయ్య, బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతో దేశానికి నష్టం

మదనాపురం: రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం రాహుల్‌గాంధీ పై అనర్హత వేటు వేసిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ జోడో యాత్రలో బీజేపీ వైఫల్యాలను రాహుల్‌గాంధీ ఎండగట్టి, పార్లమెంట్‌లో అదాని కుంభకోణంపై ప్రశ్నిస్తున్నందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ అనర్హత వేటు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటికి కాంగ్రెస్ భయపడదని తమకు ప్రజల మద్దతు ఉందన్నారు. ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాగన్న, రవీందర్ రెడ్డి, పెద్ద బాలకిష్టన్న, శ్రీనివాసులు, పెద్ద శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

పాన్‌గల్: రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్‌రావు మాట్లాడారు. అనర్హత వేటు వేయడం పార్లమెంట్ చరిత్రలో చీకటి దినమని, భారత ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీలతరెడ్డి, పరమేష్, వహీద్, రమేష్, సుకన్య, వేణు, రాజు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఎంతో ప్రయోజనం



అమరచింతలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ



ఆత్మకూర్‌లో సీమంతాలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి



పెబ్బేరులో..

అమరచింత: చిరు ధాన్యాలను ఆహారంలో తీసుకోవడంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్‌లు తమ కేంద్రాలకు చెందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి చిరుధాన్యాలను ప్రదర్శించారు.

ఆత్మకూర్‌లో..

మండల కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్, కమిషనర్ రమేష్, కౌన్సిలర్ తబసుమ్ పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని శనివారం పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మున్సిపల్ చెర్‌పర్సన్ కరుణశ్రీ హాజరయ్యారు. తల్లులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత రాకుండా ఉంటుందని వివరించడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

వనపర్తి క్రైం: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని శనివారం హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలకేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 55 ఏళ్లు పైబడిన హమాలీలకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.10లక్షల నష్ట పరిహారం, సహజ మరణానికి రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పురేందర్, రాములు, సత్యన్న, పెంటన్న, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

చైతన్య సభలు జయప్రదం చేయండి



పాన్‌గల్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వీపనగండ్ల: బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య బస్సు యాత్రలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బస్సు యాత్రలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేస్తూ మాట్లాడారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టి రైతులను దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపును తగ్గించి నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. మతం పేరుతో మనుషుల మధ్య వైషమ్యాలను సృష్టించి అధికారం చెలాయించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, మురళి, ఆశన్న, రాములు, వెంకటేశ్వర్లగౌడ్, నవీన్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

మదనాపురం: సీపీఎం చేస్తున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో పోస్టర్‌ను జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, రాజు విడుదల చేశారు. కార్యక్రమంలో వెంకట్‌రాములు, చెన్నయ్య, నరసింహచారి పాల్గొన్నారు.

పాన్‌గల్: ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఎం జనచైతన్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 17 నుంచి 29వ తేదీ వరకు సీపీఎం జనచైతన్య యాత్రలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవేందర్, లక్ష్మయ్య, భగత్, పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు వేగవంతం చేయాలి



అల్వాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పెద్దమందడి ఎంపీడీఓ అఫ్జల్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండలంలోని అల్వాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అంతకుముందు పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. పల్లెప్రకృతి వనాల్లో మొక్కలు ఎండకుండా రెండు పూటల నీళ్లు పట్టించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.

అన్నను కొట్టిన తమ్ముడికి రిమాండ్

ఖిల్లాఘనపురం: భూతగాదాలతో అన్నను కొట్టిన తమ్ముడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీహరి శనివారం తెలిపారు. మండలంలోని రుక్కన్నపల్లికి చెందిన రాములు ఈ నెల 19న భూతగాదాలను మనసులో పెట్టుకుని సొంత అన్న ఆంజనేయులుపై దాడి చేసి గాయపరిచాడు. ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శనివారం రాములును అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆన్‌లైన్ మోసం

ఖిల్లాఘనపురం: సైబర్ మోసానికి గురై నగదు పోగొట్టుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పారెడ్డిపల్లికి చెందిన కొత్తగొల్ల శ్రీనివాసులు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2022 డిసెంబర్‌లో అమెజాన్‌లో బూట్లు కొన్నాడు. వచ్చిన తర్వాత నచ్చకపోవడంతో తిరిగి పంపించాడు. వాటికి సంబంధించిన డబ్బులు ఖాతాలో జమకాకపోవడంతో, ఎదురు చూసిన యువకుడు కొన్ని రోజుల తర్వాత గూగుల్‌లో అమెజాన్ కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతికాడు. అందులో వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా, ఓ లింక్‌ను పంపారు. అందులో యూపీఐ వివరాలు, పాస్‌వర్డ్ నమోదు చేయమని చెప్పడంతో చేశాడు. కొద్ది సేపటికే ఖాతా నుంచి రూ.16,500 డ్రా అయ్యాయి. తర్వాత గమనించిన యువకుడు జనవరి 2న టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. తర్వాత అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందిన అతను, శనివారం మండల పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని కత్తేపల్లిలో శనివారం బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలపాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో పార్టీ గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.